# ★ నిర్ణీత ధరలు ★

• శ్రీమతి ద్వివేదుల విశాలాక్షి •

అది వేసవికాలం ఎండలు చాలా ఎక్కువగా వుంటున్నాయి రోజూ పగలల్లా ఎంత ఎండకాచినా సాయంకాలము మూడు గంటలయేసరికి మేఘము పట్టి కొంత చల్లపడుతూండేది అప్పుడప్పుడు కొంచము వానకూడ పడేది ఆ రోజు నాలుగు గంటలయినా ఎండ తీవ్రత తగ్గలేదు బైటికి రావడమంటే భయంగావుంది కాని పనులున్నప్పుడు ఎండా, వానా చూచే స్వభావము కాదు నాది అందులోనూ ఆ రోజున ఒక స్నేహితురాలింట్లో టిపార్టీ వుంది తప్పక వెళ్ళాలి నాలుగయేసరికి రంగనాథం, సుబ్బారావు వస్తామన్నారు వాళ్ళు వచ్చేసరికి స్నానంచేసి బట్టలు వేసుకొని సిద్దంగా వుంటే కలసి పోవచ్చునని, తువ్వాలు భుజంమీదేసుకొని తొందరగా పెరట్లోకి పోతున్నాను స్నానానికి "ఒరే, రామం, ఎక్కడికేనా బయలుదేరుతున్నావా ? ఇవాళ సాయంకాలము పిల్లని తీసుకొని వాళ్ళు వస్తామన్నారు కొంచమింట్లో వుండు ఎక్కడికీ పోబోకు" అని మాఅమ్మ ఒక వార్నింగు ఇచ్చింది. అమ్మ చెప్పేదాకా నాకు జ్ఞాపకమే రాలేదు పది రోజుల క్రిందట ఎవరో సోమయాజులు గారు తమ పిల్లను తీసుకొని పెళ్ళి మాటలకి ఆ రోజున వస్తామని వుత్తరము వ్రాసేరు సరే ఇక ఎలాగా ఇది తప్పని తద్దినం అని "ఎక్కడికీ వెళ్ళనమ్మా" అన్నాను

సరిగ్గా అన్నట్లే అయిదు గంటలకి వీధిలో జట్కా ఆగిన చప్పుడు వినబడింది "రండి, రండి" అని మా అమ్మా, నాన్నా వచ్చిన వారిని చావిడిలోనికి ఆహ్వానిస్తున్నారు వచ్చినవారికి కాఫీ ఫలహారములు ఇచ్చారులావుంది ప్లేట్లు, కప్పులు మహా జోరుగా చప్పుడవుతున్నాయి తినడమేనా చాతకాని పల్లెటూరి బైతులు లాగున్నారేమిటా అని అనుకున్నాను ఇంతలో మా చిన్నతమ్ముడు పరిగెత్తుకుంటూ నాదగ్గరకు వచ్చేడు "అన్నయ్యా, అన్నయ్యా, నాన్న నిన్ను రమ్మంటున్నారు ఎవరో చుట్టాలొచ్చారు రా — — —వేగం రా" అని ఒకటే తొందరపెడుతున్నాడు దగ్గరవున్న అద్దంలో ముఖం చూచుకొని మరోమారు క్రాపు సరిచేసుకొని బయలు దేరేను

చావిట్లో కాలు పెట్టేసరికి అందరి కళ్ళూ నామీదే వ్రాలాయి "రావోయ్ రామం, ఇతడేనండి మా మేనల్లుడు బి ఎ పాసయ్యాడు ఇంకా చదువుతానంటున్నాడు." అన్నాడు, మా మామయ్య, వచ్చిన వారికి నన్ను పరిచయం చేస్తూ "ఈడూ, జోడూ, సరిగ్గావుంది," అంది మా అమ్మ ప్రక్కనేకూర్చున్న లావుపాటి ఆవిడ ఆ తరువాత మాటల సందర్భంలో తెలిసింది, ఆవిడే నాక్కాబోయే అత్తగారని ఇంక మిగిలిన వారిలో పెళ్ళికూతురు తండ్రి సోమయాజులుగారు మంచి స్ఫురద్రూపి, మాటకారి కాని విషయంలో పెద్దరికమంతా తన అన్నగారికే ఇచ్చి తాను నామ మాత్రంగా కూర్చున్నాడు "రామం, వీరే సోమయాజులుగారు, వీరి పిల్ల సుందరిని నీకు ఇవ్వాలని వుందని ఆమధ్య వుత్తరము వ్రాసేరని నీతో చెప్పేను కదూ" అని అన్నారు, మా నాన్నగారు "ఏదో లాంచనం కాని మా సుందరిని చూడ్డానికేముంది సుందరి, నిజంగా సుందరే" అన్నారు, పెళ్ళికుమార్తె పెద్దనాన్నగారు ఆమాట అతను అనాలని అన్నారు, కాబోయే కన్యాదాత నన్నుద్దేశించి సరే ఇక పరీక్షచేసి నా అభిప్రాయం చెప్పాలి కదా వారికి, ముఖ్యంగా మా నాన్నగారికి. అక్కడే కుర్చీలో కూర్చున్న సుందరిని అంతదాకా చూడలేదని, కాదు బాగుగా పరీక్షించలేదన్న మాట సుందరి పొడుగ్గా సన్నంగావుంది రంగు తెలుపే అని చెప్పవచ్చును కళ్ళు, ముక్కు తీరుగానే వున్నాయి వాళ్ళ నాన్నగారంత స్ఫురద్రూపి కాకపోయినా చక్కనిదనే చెప్పవచ్చును ఇంక కుంటీ మూగా వగైరా పరీక్షలన్నీ మాఅమ్మ ఎలాగ చేస్తుంది అందుచేత నా అభ్యంతరము లేదని వారికి తెలియజేసి వేగం అక్కడనుండి బయట పడుదామనుకున్నాను నాకు అవతల పనుంది పెద్ద వారంతా వచ్చారు కదా అని కూర్చున్నాను "మీకిష్టమైతే నాకూ ఇష్టమే, మరి నే వెళ్ళివస్తా నాన్నా" అని లేచిపోయేను తరువాత తతంగం ఏమి జరిగిందో నే నడగనూ లేదు, మా వాళ్ళు చెప్పనూ లేదు

ఓమారు అలా మార్కెట్టు వేపు పోయివద్దాము రా

అన్నాడు మామయ్య. సరే పద అని బయలుదేరాను మార్కెట్టు మా యింటికట్టే దూరములేదు రెండు వీధులు దాటగానే కూరల మార్కెట్టు అది వేసవికాలం అవడముచేత కూరలట్టే తాజాగాలేవు ధరలు కూడ ఎక్కువగానే ఉన్నవి అలాగే కొనుక్కుపోతున్నారు జనం కూరల మార్కెట్టుకీ, వెండి, బంగారము, ఇత్తడి మొదలైన సామాను లమ్మే మార్కెట్టుకీ మధ్య కొంత ఖాళీ జాగా వున్నది అక్కడ మామిడి కాయలు పళ్ళు, కుప్పలు, కుప్పలుగా పోసేరు ఎప్పుడూ ఆ స్థలం పళ్ళ మార్కెట్టుగానే ఉపయోగ పడుతూండేది ఈ రోజున వున్న విశేషం ఏమిటంటే ప్రతి కుప్పదగ్గరా ఒక బోర్డు కట్టబడి వుంది

వానిపై 1 వ తరగతి బంగినపల్లి మామిడిపళ్ళు వంద 1 కి రు16-0-0, 2 వ తరగతి వంద1 కిరు 12-0-0 1 వ తరగతి సువర్ణరేఖ మామిడి పళ్ళు వంద 1 కి రు 13 - 0 - 0 2 వతరగతి వంద 1 కి రు 9-0-0 ఇలాగ వాటి నాణ్యాలనూ, పిలువలనూ వ్రాసివున్నాయి అందరూ వాటి ప్రకారమే కొనుక్కొంటున్నట్లుంది మా పక్కింటి శాస్త్రి అన్నిటికన్నా తక్కువ రకముగల బోర్డు కొరకు వెదకుతున్నాడు ఇంజనీరు గారబ్బాయి 1 వ తరగతి బంగినపల్లి పళ్ళు నాలుగు వందలు ఒక బస్తాలో వేయిస్తున్నాడు "కానీదగ్గరనుండి బేరాలాడి కొనే పద్ధతి ఎప్పటినుండి పోయిందా" అని ఆశ్చర్యపోయాను అలా ఆలోచిస్తూండగానే వెండి, బంగారు మార్కెట్టుదాటాము అది దాటగానే లంకదిబ్బ వుంది దానిని పూర్వం రామలీల వుత్సవాలు చేసేటప్పుడు లంకగా ఉపయోగించేవారట ఇప్పుడు అలా జరుగక పోయినా లంకదిబ్బనే పేరు ఆ స్థలానికి వుండిపోయింది సాయంకాలము చల్లగాలికి చాలా మంది అక్కడకు చేరుతారు వూరికి నడుమ నుండుటచే దానికి చాల ప్రాముఖ్యమొచ్చింది అక్కడ మున్సిపాలిటీ వారు ప్రజోపయోగము కొరకు ఒక రేడియో కూడా పెట్టారు అది వినడానికి చాలామంది హాజరవుతూంటారు మామయ్య, నేను రోజూ అక్కడికే వెళ్ళి కూర్చుంటాము

"కాని, ఇదేమిటి ఇక్కడ ఇంత పెద్ద పెద్ద గదులు ఎప్పుడు కట్టారు నిన్నటిదాక ఇది వట్టి మట్టిదిబ్బే ఆ గదులలో చాలమంది మనుష్యులున్నారే. అంతా మగవాళ్ళే, ఆడవాళ్ళు ఒక్కరేనా కన్పించరేమి ఇదిగో శాస్త్రిగారి కుమారుడు అదిగో రంగనాథం, సుబ్బారావు కూడా వున్నారు వీళ్ళంతా ఇక్కడ ఏమిచేస్తున్నారు? ఇక్కడ ఏదైనా కొత్తగా మార్కెట్టు ఓపెన్ చేసారా? వీళ్ళంతా కొనడానికి వచ్చేరా? మరి ఇందరికీ తెలసిన ఈ మార్కెట్టు సంగతి తనకు తెలియలేదెందుచేత?

అదిగో అక్కడ ఏవో బోర్డులున్నాయి ఎవరో గట్టిగా గొంతుక బ్రద్దలయ్యేలా అరుస్తున్నారు ఏమిటో వినాలి "మంచితరుణము వృధాగా జారవిడువకండి, నూతన సంవత్సరానికి తగ్గింపుధరలు" వేటికి ఈ తగ్గింపు ధరలు బట్టలకా, తినుబండారాలకా? అవేవీ ఇక్కడ కనబడవే? అంతా మనుష్యులే. కాని మామయ్యనడుగుదాము "మామయ్యా, మామయ్యా" ఏడీ మామయ్య ఎక్కడా కనిపించడేం సరి ఈ జనసమర్ధంలో విడిపోయాము నేనే వెళ్ళి చూస్తాను అదిగో అక్కడ చిన్నవాళ్ళంతా కుర్చీలలో కూర్చున్నారు పెద్దలు అనగా తండ్రులు దగ్గర నిలబడ్డారు ఏదేనా ఫోటో తీయించుకొంటున్నారా? అబ్బే అలాలేదే ఇదిగో ఈ ముందర అట్టలపై యేమిటో వ్రాసివున్నది దగ్గరకు వెళ్ళి చూదాము

నెంబరు 1 వరుడు బ్రాహ్మణుడు, వయస్సు 20 సం॥ చదువు B A కట్నం 5000 రు॥ నెంబరు2 వరుడు, నాయుడు, వయస్సు 25 సం॥ చదువు M A కట్నం 6000 రు॥ నెంబరు 3 వరుడు, నియ్యోగి, వయస్సు 18 సం॥ చదువు లేదు జీతం 100 రు కట్నం 3000 రు॥.

ఇలా ఒక పదిబోర్డులు చదివేసరికి సంగతి అర్థమైంది అయితే ఈ వరుల మార్కెట్టులో నా ధర ఎంతా?" అని అనుకున్నాను సరే అదీ చూద్దామని అలా వెడుతున్నాను ఓ పాతిక గజాలు నడచేనో లేదో మామయ్య కనిపించేడు "ఏంరా, గామం ఇంతసేపయు నీకోసమే వెదుకుతున్నాను రా - - తొందరగా మీనాన్న చికాకు పడుతున్నాడు బేరాలు పోతున్నాయిట" అన్నాడు "ఏమిటి మామయ్యా ఇదంతా, బేరాలు పోవడమదేమిటి నాన్న ఏదేనా వ్యాపారము పెట్టాడా" అన్నాను "ఏమిరా, ఏమీ తెలియనట్లడుగుతున్నావు ఈ రోజున వరుల ధరలు తగ్గుముఖం పట్టేయిట ఎంతకో ఒకంతకి సెటలు చేసుకోవాలని బావ తొందరపడుతున్నాడు" అన్నాడు

# నిర్ణీత ధరలు

"వరులకి ధరలేమిటి మామయ్యా నీకేమైనా పిచ్చా?" అన్నాను "నాకు పిచ్చో, నీకు పిచ్చో ఆ బోర్డులు చూడు ఇప్పుడు అన్నింటికీ గవర్నమెంటువారు ధరలు నిర్ణయించేరు అంతకుమించి బేరములేదు మామిడి పళ్లు లగాయతూ మగపిల్లల వరకూ అంతా అంతే అదుగో మీనాన్న "బావా, ఇదిగో రామం" అన్నాడు మామయ్య

నన్ను చూడగానే నాన్న ఇంతముఖం చేసుకొని "రారా నాయినా, ఇలా ఈ కుర్చీలో కూర్చో" అన్నాడు ఇందాకటి బోర్డులు జ్ఞాపకమొచ్చి మీదికి చూసేను నెంబరు 1 వరుడు, బ్రాహ్మణుడు, వయస్సు 20 సం॥ చదువు B A ఆస్తివుంది కట్నం 5000 రు॥ అని వ్రాసివుంది వొళ్లుజల్లుమంది "నాన్నా నన్ను అమ్మజూపుతున్నావా? నా ఖరీదు అయిదువేలా?" అని కోపంతో గట్టిగాఅరిచేను.

"ఏమిటిరా రామం అలా పలవరిస్తున్నావు సరిగ్గా పడుకో" అన్నది అమ్మ. "హోయి, భగవంతుడా! ఇదంతా కలా" అనుకున్నాను మరునాడు వుదయము అమ్మను అడిగేను, సోమయాజులుగారి సంబంధము మాట యేమిటయిందని "వాళ్లు మనతో తూగలేరురా" అంది "అంటే" అన్నాను అర్థంకాక. "ఏమీలేదు, మనము కోరిన కట్నం ఈయలేమన్నారు" అంది.

"నిన్న రాత్రి నాకొచ్చిన కలకీ, ఈ జరుగుతున్న సంఘటనలకీ బేధమేమిటి? ఎలాగూ తప్పనప్పుడు ఈ వేలం పాటకన్నా అలా ధరలు నిర్ణయించేస్తే అదే నయమేమో" అనిపించింది

★


